ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 02 | జూలై | 2024
పేజీలు 8

## ఒత్తిళ్లా లేక వ్యక్తిగత వ్యవహారమా..?



### ఎస్ఐ ఆత్మహత్యాయత్నంపై భిన్న స్వరాలు

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఆత్మహత్యాయత్నం పోలీస్ శాఖలో తీవ్ర చర్చ నీయాంశమైంది. ఉన్నతాధికారుల ఒత్తిళ్లా లేక వ్యక్తిగత కారణంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారా అన్నది తేలియాల్సి ఉంది. గతంలో మణుగూరు ఎస్ఐగా పనిచేసిన శ్రీను నాలుగు నెలల

మిగతా 2లో..

# ఎక్సైజ్ శాఖలో లొల్లి..!





**-మసకబారిన ప్రతిష్ట**
**-బదిలీలోనూ ఎక్సైజ్ మార్క్**
**-తప్ప చేస్తే కోరుకున్న చోటికి డిప్యూటేషన్**
**-ఆరోపణ వస్తే దూర ప్రాంతాలకు బదిలీ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఊరందరిది ఒక దారి ఉలిపి కట్టేది మరో దారి అన్నట్లు అన్ని ప్రభుత్వ శాఖలు ఒక రీతి ఎక్సైజ్ శాఖ మరో రీతి అన్నట్లుంది శాఖ పనితీరు. ఉద్యోగుల వ్యవహార శైలి తీవ్ర విమర్శలకు తావిస్తుంది. ఎక్సైజ్ శాఖలో పైరవీలకు పెద్దపీట వేస్తున్నారు. ఇక బదిలీల వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. పరపతి ఉంటే చాలు పని చేయక పోయినా ఎక్సైజ్ శాఖలో ఉద్యోగానికి ఢోకా లేదన్న భావన ఆ శాఖ ఉద్యోగుల్లో వ్యక్తమవుతుంది. శాఖ ఉద్యోగులే ఆ శాఖకు అప్రతిష్ట తీసుకు వస్తున్నారు. తలను తోక ఆడించినట్లు కానిస్టేబుల్స్ ఉన్నతాధికారులను తిప్పేస్తున్నారు. ఖమ్మం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఓ ఘటన ఆ శాఖ తీరుకు అద్దం పడుతుంది. కులం, వర్గం ఇతర వ్యవహారాలు ఎక్సైజ్ శాఖలో కొందరికి వరంగా మారగ మరి కొందరి ఉద్యోగులకు శాపమైంది.

ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్‌లో డిప్యూటేషన్ పై పనిచేస్తున్న

మిగతా 2లో..

## ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.450 కోట్లు



**- నియోజకవర్గాభివృద్ధికి మరో రూ.72.86 కోట్లు మంజూరు**
**- నగరాలకు ధీటుగా అభివృద్ధి చేసి తీరుతాం**
**- అన్ని విధాలుగా సహకరిస్తున్న మంత్రి వర్గం**
**- విలేకరుల సమావేశంలో కూనంనేని**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెంపాల్వంచ పట్టణాలను కలుపుతూ ఔటర్‌రింగ్ రోడ్‌కు రూ.450 కోట్లతో పాటు నియోజకవర్గాభివృద్ధికి మరో రూ.72.86 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం పంట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.128.48 కోట్లు, డ్రైన్లు, రోడ్ల నిర్మాణాలకు రూ.4 కోట్ల పనులకు భూమిపూజ చేసిన అనతి కాలంలోనే ఔటర్ రింగ్ రోడ్, అభివృద్ధి నిధులు మంజూరయ్యాయని, ఇది కొత్తగూడెం చరిత్రలోనే సువర్ణ అధ్యాయం అన్నారు. కొత్తగూడెం,పాల్వంచ పట్టణాలకు అనిశెట్టిపల్లి జాతీయ రహదారి 30పి నుండి సర్వారం, రామవరం, జగన్నాధపురం మీదుగా 30వ జాతీయ రహదారిని కలుపుతూ 25 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తారని చెప్పారు. నిర్మాణం పూర్తయితే జంటపట్టణాలకు ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. భద్రాచలం పట్టణం వద్ద విజయవాడజగ్దదల్‌పూర్ జాతీయ రహదారి 30ని 70 కిమీ మేరా అభివృద్ధి చేసేందుకు గానూ రూ.50 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం

మిగతా 2లో..

## చరిత్రలో నిలిచేలా మధిరను అభివృద్ధి చేస్తా



**-మధిరను ఐటి హబ్‌గా మారుస్తాం**
**- డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క**

**ప్రజాపక్షం/ మధిర :** మధిర చరిత్రలో గుర్తుండిపోయేలా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని తెలంగాణ డిప్యూటీ సిఎం, విద్యుత్, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సోమవారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా మధిర మున్సిపాల్టీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులకు రూ.128కోట్లు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. ఇప్పటికే మధిర

మిగతా 2లో..

# ఎక్సైజ్ శాఖలో లొల్లి..!

(మొదటిపేజీ తరువాయి)

ఓ కానిస్టేబుల్ సరిగ్గా విధులు హాజరు కాకుండా కుల పంచాయితీలో ఉంటాడని ఆ శాఖలో ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం ఎస్ఐ ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ మధ్య వివాదం జరిగింది. అది చిలికి చిలికి గాలి వానలా మారింది. ఒక ప్రభుత్వ శాఖలో అది క్రమశిక్షణ కలిగి యూనిఫాం శాఖలో కొందరు కుల పెద్దలు ఒక ఉద్యోగి తరుపున స్టేషన్‌కు వచ్చి మరో అధికారిపై ఘర్షణ పడే స్థాయికి దారి తీసింది. ఈ క్రమంలో స్టేషన్‌లోనే ఓ పంచాయితీ నిర్వహించారు. బహుశా ప్రైవేటు వ్యక్తులు ఎక్సైజ్ శాఖ ఉద్యోగులకు సంబంధించి స్టేషన్‌లోనే పంచాయితీ నిర్వహించడం ఈ శాఖలో తప్ప మరో శాఖలో సాధ్యం కాకపోవచ్చు. ఇంత జరిగిన తర్వాత ఈ రచ్చకు కారణమైన ఉద్యోగుల బదిలీ విషయంలో ఎక్సైజ్ మార్క్ చూపించారు. ఎస్ఐను ఇతర జిల్లాలకు బదిలీ చేసి డిప్యూటేషన్ పై ఉన్న కానిస్టేబుల్‌ను మాత్రం ఆయన కోరిక మేరకు ఖమ్మంలోని మరింత అందుబాటులో ఉన్నమరో ఎక్సైజ్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఘర్షణకు ఇద్దరు ఉద్యోగులు కారణమైనప్పుడు ఒకరి పట్ల ఒక నీతి మరొకరి పట్ల మరో నీతి ఎందుకు ప్రదర్శిస్తున్నారన్నది ఆ శాఖ ఉన్నతాధికారులకే తెలియాలి. ఇప్పుడు ఈ బదిలీల తిరకాసు ఉన్నతాధికారులపై విమర్శలకు తావివ్వడమే గాక పైరవీ ఉంటే ఎక్సైజ్ శాఖలో ఉద్యోగులు ఏదైనా చేయవచ్చునన్న భావన బలపడింది. శాఖ పనితీరు విషయానికొస్తే ఎవరు ఏ ఆరోపణ చేసినా ఆధారాలతో సహా మీడియాలో వార్తలు వచ్చినా స్పందించని శాఖలలో అగ్రగామి ఎక్సైజ్ శాఖ. ఉలుకు పలుకు ఉండదు ముఖ్యంగా మద్యం దుకాణాల్లో విక్రయించాల్సిన మద్యం బెల్ట్ షాపుల్లో విక్రయిస్తున్న ఆ శాఖ ఆ పని మాది కాదులే అన్నట్లుగా వ్యవహరిస్తుంటారు. మద్యం వ్యాపారులు అధిక లాభాల కోసం తమ దుకాణాల్లో విక్రయిస్తే ఎంఆర్‌పికే విక్రయించాలని బెల్ట్ షాపుల్లో విక్రయిస్తున్నారు. అధిక ధర కలిగిన మద్యం సైతం బెల్ట్ షాపుల్లో లభ్యమవతుంది. అదే మద్యం వినియోగదారులకు మద్యం దుకాణాల్లో



లభ్యం కాదు. ఈ విషయం అనేక సార్లు ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదులు అందినా కనీస చర్యలు తీసుకోలేదంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి ఖమ్మం జిల్లానుంచి గతంలో ఇతర రాష్ట్రాలకు మద్యం తరలిపోతుందని వాహన నెంబర్లతో మీడియాలో వార్తలు వచ్చినా ఆ శాఖలో చలనం లేక పోయింది. ఇప్పుడు కాపు సారా తయారీ కూడా క్రమ క్రమంగా పుంజుకుంటుంది. తయారీ దారులు ఎక్సైజ్ శాఖ తీరును గమనించి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఈ విషయం తెలిస్తే ఎక్సైజ్ అధికారులు సంబంధికులతో మాట్లాడుతారు తప్ప ఎందుకో కాని చర్యలు తీసుకోరు. ఉమ్మడి ఖమ్మంజిల్లా ఎక్సైజ్ శాఖ పనితీరు పై ఉన్నతాధికారులు సమీక్ష చేయాల్సి ఉంది. సుదీర్ఘ కాలం ఒకే స్టేషన్‌కు కొందరు పరిమితమై తమ దందా నడిపిస్తున్నారు. మొత్తం ఉమ్మడి ఖమ్మంజిల్లా ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయకపోతే ప్రభుత్వ ఆదాయానికి పెద్ద మొత్తంలో గండిపడటమే గాక వినియోగదారులు సైతం ఇబ్బందిపడాల్సి వస్తుంది. మరోసారి కాపుసారా మహమ్మారి విజృంభించే అవకాశం ఉంది.

# గ్రామ పంచాయతీలపై కనికరం లేని కార్యదర్శులు

**-ఐదు సంవత్సరాలుగా తిష్ట వేసిన కార్యదర్శులు**
**-కార్యదర్శుల చేష్టలతో గ్రామాల్లో విసిగిపోతున్న ప్రజలు**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** ఉన్నత విద్యను చదివి ఎంతో మంది నిరుద్యోగులకు ఏమి పనులు లేక వ్యవసాయ పనులు చేసుకుంటూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కానీ ఉమ్మడి రాష్ట్రం నుండి విడిపోయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కేసీఆర్ ప్రభుత్వం సుమారు 10 సంవత్సరాల పాటు పాలన సాగించింది. అదే సమయంలో అప్పటి ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులను నియమించేందుకు వారి విద్య అర్హతను బట్టి ప్రభుత్వం నిర్ణయించిన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని ఊరుకో పంచాయతీ కార్యదర్శిని ఒప్పంద కార్యదర్శిగా నియమించింది. అప్పటినుండి కొలువు చేస్తున్న కార్యదర్శులు మంచిగానే పనులు చేశారు. ఎప్పుడైతే మాజీ ముఖ్యమంత్రి అసెంబ్లీలో రెగ్యులర్ చేస్తామని ప్రకటించడంతో రెగ్యులర్ అయిన తర్వాత కార్యదర్శులకు హోదా పెరగడంతో పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీల పై కనికరం మార్చారు. గత ప్రభుత్వంలో ఉద్యోగం సాధించి రెగ్యులర్ అయిన తర్వాత ఎంతో బాధ్యతారహితంగా పనిచేయాల్సిన కార్యదర్శులు నూతన ప్రభుత్వంలో ఆ పనితనాన్ని నిరూపించట్లేదు ప్రభుత్వం ఎన్నో కష్టాలు ఉన్న వారికి ప్రతినెల ఫస్ట్ నుండి పదో తారీకు లోపు 30 వేల రూపాయలు వేతనం చెల్లిస్తుంది. కార్యదర్శులు సమయ పాలన లేకుండా ఇష్టం వచ్చినట్లు వస్తూ ప్రజల్ని త్రీవర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఒక గ్రామానికి చెందిన కార్యదర్శి విధులకు వచ్చి గ్రామ పంచాయతీ వెనక ఉన్న పంపులు వేసే వారి ఇంట్లో సేద తీరుతుందని ప్రజల ఆరోపిస్తున్నారు. ఇంకో పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ రాకుండానే అటెండర్ ద్వారా అటెండెన్స్ ఎంచుకొని బయట తిరుగుతున్నాడు. మరొక కార్యదర్శి గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగం చేసి గ్రామ పంచాయతీకి మండల ఎంపీడీవో కి ఎలాంటి సమాచారం లేకుండా బయట తిరుగుతున్నాడు మరొక కార్యదర్శి కి ఫోన్ చేస్తే నేను గ్రామ పంచాయతీకి వచ్చి పోయాను మీరు ఏ టైం పెడితే ఆ టైం కి వస్తే నేను మీకోసం వెయిట్ చేయాలని ఎదురు సమాధానం చెబుతున్నారు. ఇంత జరుగుతున్న మండల ఎంపీడీవో ఉన్నత అధికారులు కార్యదర్శులపై చర్యలు తీసుకోకపోవడం శోచనీయం వెంటనే 5 సంవత్సరాల నుంచి ఒకే గ్రామ పంచాయతీలో కొలువు చేస్తున్న కార్యదర్శులను రిలీవ్ చేసి కొత్తవారిని నియమించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# జీవితంలో స్థిరపడిన నాడే చదువుకు సార్థకత

**- ఐటిడిఏ పిఓ బి.రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** రాబోయే రోజుల్లో ఇంకా మంచిగా చదువుకుని జీవితాల్లో స్థిరపడిన నాడే చదువుకు సార్థక దొరుకుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. స్థానిక గిరిజన గురుకుల కళాశాల్లో ఎంపిసి చదివి ఐఐటి 236వ ర్యాంకు సాధించి తిరుపతిలోబిటెక్ సీటు సాధించిన తేజావత్ సింధు, ఐఐటి ఖోరక్‌పూర్‌లో మైనింగ్‌లో బిటెక్ సీటు సాధించిన రీతు స్రవంతిలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల చదువుల్లో మరింత రానించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. చక్కగా చదువుకుని జీవితంలో స్థిరపడిన నాడే చదివిన చదువులకు సార్థకత చేకూరుతుందని, అటు తల్లిదండ్రులతో పాటు చదువులు చెప్పిన గురువులకు మంచిపేరు తెచ్చిపెట్టిన వారవుతారని చెప్పారు. అనంతరం ఇంటర్ ప్ర.సం.లో ఏంపిసి విభాగంలో 467 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిన భూక్యా పూజను ప్రోత్సహిస్తూ భవిష్యత్‌లో మరిన్న విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపల్ దేవదాస్, పాటు పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఒత్తిళ్లా లేక వ్యక్తిగత వ్యవహారమా..?

(మొదటిపేజీ తరువాయి)

క్రితం అశ్వారావుపేట బదిలీ పై వచ్చారు. ఆదివారం ఉదయం స్టేషన్ నుంచి కనిపించకుండాపోయిన ఎస్ఐ శ్రీను ఆ మండలంలోనే మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉన్నట్లు ఆయన ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిర్ధారిస్తున్నారు. మూడు గంటల తర్వాత ఆయన ఎక్కడ ఉన్నాడో తెలియరాలేదు. ఆయన స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లా నర్సాపురం మండలంలోని నర్సక్కపేట కు కొద్ది దూరంలో మధ్యాహ్నం పురుగుమందు కలుపుకుని తాగి తానే 108కు సమాచారం ఇచ్చాడని తెలుస్తుంది. 108 సిబ్బంది ఆయనను ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం చికిత్సపొందుతున్నాడు. అశ్వారావుపేట ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన దగ్గర నుంచి కిందిస్థాయి సిబ్బందికి ఎస్ఐకు మధ్య తీవ్ర బేధాభిప్రాయాలు ఏర్పడ్డాయి. పలుమార్లు ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి రావడం వచ్చిన ప్రతిసారి అధికారులు ఎస్ఐనే మందలించడం, మెమోలు ఇవ్వడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. మరి కొందరు వ్యక్తిగత కారణాలు కూడా ఉండవచ్చునని అంటున్నారు. ఏదీ ఏమైనా ఆత్మహత్యాయత్నానికి కారణాలు ఏమైనా ఎస్ఐ శ్రీను ఘటన పోలీస్ శాఖలో ఒక కుదుపుకు దారి తీసింది.

## ఔటర్ రింగ్ రోడ్డు

# నిర్మాణానికి రూ.450 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఎదురుగా దాదచారులు దాటేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జీ నిర్మాణానికి రూ.2.64 కోట్ల నిధుల మంజూరీ లభించిందని, అదే విధంగా విజయవాడజగ్దల్‌పూర్ 30వ జాతీయ రహదారిలో కిన్నెరసాని నదిపే పంతెన నిర్మాణానికి రూ.20.22 కోట్ల మంజూరీ లభించిందని చెప్పారు. మంజూరై నిధులతో పనులు పూర్తయితే పట్టణాలకు ధీటుగా కొత్తగూడెం, పాల్వంచ నగరాలు తయారవుతాయని, గడిచిన ఏడు మాసాల్లో కొత్తగూడె ం నియోజకవర్గానికి వివిధ రూపాల్లో నిధులు భారీ మంజూరవుతున్నట్లు తెలిపారు. కొత్తగూడెం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మంత్రివర్గం సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తోందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు ఎస్కే సాబీర్ పాషా, అన్నవరపు కనకయ్య, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళీ, కొండా వెంకన్న, టిడిపి జిల్లా నాయకులు నల్లమల వేణు, శరత్, డిసిసిబి చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ, వి.పూర్ణ చంద్రరావు, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, జక్కుల రాములు, నూనావత్ గోవింద్, యూసఫ్, నేరళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రలో నిలిచేలా

# మధిరను అభివృద్ధి చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అంతర్గత రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించటం జరిగిందని తెలిపారు. అలాగే మధిర మున్సిపాల్టీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి దశలవారీగా పరిష్కరించటం జరుగుతుందని, మధిర పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి అవసరమయ్యే అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల వారు మధిర అభివృద్ధిని చూసి చెప్పుకునేలా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. మధిర నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానని, మధిరకు త్వరలోనే ఐటి హబ్‌ను తీసుకువస్తామన్నారు. మధిర మండలం యండ్లపల్లి గుట్ట వద్ద ఎంఎస్ఎమ్ఇ ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుకు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. యువ పారిశ్రామికవేత్తలకు ఎస్ఎస్ఎంఇ పరిశ్రమలు పెట్టుకునే విధంగా ప్రభుత్వం నుండి రాయితీలు, ప్రోత్సహాకాలు అందిస్తామని తెలిపారు. అలాగే మహిళల స్వాలంభన కోసం ఇందిరా డైరీ ఏర్పాటు చేసి వారు ఆర్థికంగా ఎదిగేలా కృషి చేస్తామన్నారు. మధిర నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షల మేరకు ఈ ప్రాంత అభివృద్ధికి అన్నివిధాలుగా తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/ఏన్కూరుః** మండల పరిధిలోని ఆరికాయలపాడు గ్రామంలో ఇటీవల మృతి చెందిన నల్లమల శ్రీనివాసరావు కుటుంబాన్ని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పరామర్శించారు. సోమవారం దశ



దిన కార్యక్రమానికి హాజరై శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులు ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు స్వర్ణ నరేందర్, కొణిజర్ల మండల అధ్యక్షులు నారాయనరావు, మండల మహిళా అధ్యక్షురాలు కొప్పుల ప్రభావతిరెడ్డి, తిమ్మారావుపేట ఎంపిటిసి లచ్చిరాంనాయక్, నాయకులు వాసిరెడ్డి నాగేశ్వరరావు, నల్లమల శివకుమార్, కట్టా సత్యానారాయణ, గుర్రం రవి, తాళ్లూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన చట్టాలపై సర్వత్రా నిరసన



**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** కేంద్ర ప్రభుత్వం సోమవారం నుంచి అమలులోకి తీసుకు వచ్చిన నూతన చట్టాలపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతుంది. కార్మికులు, ఉద్యోగులు, మేధావి వర్గంతో పాటు సామాన్య ప్రజలు సైతం ఈ చట్టాలను వ్యతిరేకిస్తున్నారు. పలుచోట్ల నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఖమ్మంలో న్యాయవాదులు చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. ముఖ్యంగా రవాణా రంగానికి సంబంధించి బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిన చట్టాలు డ్రైవర్ల పాలిట శాపంగా మారనున్నాయి. భారతీయ నాగరికత సురక్ష సహిత , భారతీయ సాక్ష్యా, భారతీయ అన్యాయ సహిత తదితర చట్టాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో డ్రైవర్ తప్పిదమే అన్నట్లుగా ఏడేళ్ల జైలుశిక్ష విధించేవిధంగా చట్టాలను రూపొందించారని రవాణా రంగ కార్మికులు ఆరోపిస్తున్నారు. పోలీస్ స్టేషన్లకు సంబంధం లేకుండా ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేస్తే కేసు బుక్ చేసుకుని ఎఫ్ఐఆర్ చేయడం లాంటి చట్టాలు ఇబ్బందికరంగా మారాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. లైంగిక దాడి గురించి ప్రచురించే వార్తలకు సంబంధించి కూడా కొత్త చట్టాలు ఇబ్బంది కరంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో సర్వత్రా నిరసన వ్యక్తమవుతుంది. ఖమ్మంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు షేక్ లతీఫ్ మాట్లాడుతూ కొత్త చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూడుచట్టాలు బాధితులకు అనుకూలంగా ఉన్నాయని బిజెపి చెబుతుందని కాని వాస్తవం వేరుగా ఉందని సీనియర్ న్యాయవాదులు వడ్డెల్లి కృష్ణమూర్తి, కొల్లి సత్యనారాయణ లు తెలిపారు. నిరసన కార్యక్రమంలో ఐఏఎల్ నాయకులు పోట్ల మాధవరావు, ఓరుగంటి శేషగిరి, ఐలు నాయకులు ఏడునూతల శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వరరావు, నవీన్, చైతన్య, చింతనిప్పు వెంకట్, వివిధ పార్టీలనాయకులు బిచ్చాల తిరుమలరావు, సుగుణారావు, శరత్‌కుమార్ రెడ్డి, దానయ్య, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన పోలీస్ అధికారులను సన్మానించిన సిపి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పదవి విరమణ పొందిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో సిపి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో బాధ్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖకు ఎనలేని సేవలతో పోలీస్ అధికారులు మన్ననలు పొందారని ఆయన కొనియాడారు. రిటైర్ మెంట్ తన వృత్తికే కాని తన వ్యక్తిత్వానికి కాదని మీ విధి నిర్వహణలో తోడ్పాటునందించిన కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. శాఖపరంగా రావాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు, అడిషనల్ డిసిపి అడ్మిన్ నరేష్‌కుమార్, ఏసిపి ఆర్ సుశీల్ సింగ్, ఆర్ ఐ కామరాజు, పోలీస్ అసోసియేషన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు అభయహస్తం అందించాలి : సిపి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కుటుంబ ఆదరణ కరువై, తల్లిదండ్రులకు దూరమైన చిన్నారులకు అభయ హస్తం అందించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ 10 కార్యక్రమంలో భాగంగా ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్లను సోమవారం ఆయన ప్రారంభించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిపి మాట్లాడుతూ జూలై ఒకటి నుంచి నెల పాటు జరిగే కార్యక్రమంలో బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న చిన్నారులను, ట్రాఫికింగ్ ద్వారా వివిధ వ్యవస్థల్లో బంధీలైన వారిని గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చాలన్నారు. తల్లిదండ్రులు లేని చిన్నారులను సంరక్షణ కేంద్రాలకు తరలించి వారి బాధ్యతలను సంబంధిత విభాగాలకు అప్పగించనున్నారు. చదువుకోవాలనే తపన ఉన్నప్పటికీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించక పనివాళ్లుగా మిగిలిపోతున్న చిన్నారులను చేరదీసేందుకు ప్రభుత్వం తీసుకు వచ్చిన ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ మంచి ఫలితాలను ఇస్తున్నట్లు తెలిపారు. గతేడాది నుండి ఇప్పటి వరకు 184 మంది చిన్నారులను రెస్క్యూ చేసి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. అదేవిధంగా బాలలతో వెట్టి చాకిరి చేయిస్తున్న 67 మంది యజమానులపై ఎఫ్ఐఆర్ లు నమోదు చేయడం జరిగిందన్నారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 18 ఏళ్ల లోపు తప్పిపోయిన, వదిలేసిన, కార్మికులుగా ఉన్న బాలబాలికలు ఉన్నట్లయితే అలాంటి వారి సమాచారం అందిస్తే వారిని రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాలలతో బలవంతంగా భిక్షాటన చేయించిన వారిపై, వెట్టి చాకిరి చేయించిన వారిపై కేసులు యధావిధిగా నమోదు చేయాలన్నారు. ఈ ఆపరేషన్‌లో మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ విభాగం, కార్మిక శాఖ, కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ, లీగల్ సర్వీసెస్ అథారిటీ విభాగాలతో పాటు స్వచ్చంద సంస్థలు సమన్వయంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు, అడిషనల్ డిసిపి అడ్మిన్ నరేష్‌కుమార్, ఏఆర్ ఏసిపి నర్సయ్య, సుశీల్ సింగ్, ఆర్ఐ కామరాజు, ఎస్సైలు శ్రీకాంత్, సిసిఆర్‌బి ఏఎస్సై జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## దేవతామూర్తుల ప్రతిరూపాలే వైద్యులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలను ఖమ్మం నగరంలోని పెవిలియన్ మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవతామూర్తుల ప్రతిరూపాలే వైద్యులని, వైద్యో నారాయణ హరి అంటారని, వైద్యులను గౌరవించాలని ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బుడిగం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా బుడిగం శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో వైద్యుల పాత్రల ప్రాముఖ్యతను గుర్తించి ప్రశంసించేందుకు భారతదేశంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. అనంతరం వైద్యులు సామినేని సీతయ్య, పేర్ల ఆదిశంకర్‌రావు, పేర్ల శోభాదేవి, కాకుమాని నర్సింహారావు, శ్రీరాములు, శ్రీనాథు లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వెంకట్, సుదర్శన్, రాకం శ్యామ్‌బాబు, నర్సింహారావు, దామోదర్‌రెడ్డి, కార్మిక నేత మంద వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, భాస్కర్‌రావు, దామోదర్‌రెడ్డి, హరిబాబు, అమీర్ అలీ, వెంకట్ బాబు రామనాథం, వెంకట్, వెంకటేశ్వర్లు, వేణు, జ్యోతి, మంగ, రమ, సబిత తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజుల పాటు ఆందోళన

## పోలీసుల పహారా నడుమ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మహిళ అంత్యక్రియలు





**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** నేలకొండపల్లి మండలం లోని సధాశివాపురం లో అనుమానస్పద స్థితి లో వివాహిత మృతి చెందిన ఘటన తెలిసిందే... మృతదేహం వద్ద రెండు రోజుల పాటు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. తను కూతురు ను అల్లుడే చంపాడని బాధితులు ఆరోపించారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం సాయంత్రం వరకు ఉద్రిక్తతల పరిస్థితులు నెలకొన్నాయి. భర్త, అత్త ను పిలిపించాలని, చిన్నారులకు న్యాయం చేయాలని మృతురాలి బంధువులు పట్టుబట్టటంతో టెన్షన్...టెన్షన్ నెలకొంది. భర్త అవినాష్ ను పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. ఈ నేపధ్యంలో ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయి లో ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు భారీగా మోహరించారు. మృతదేహం ను పోస్టుమార్టమ్ నిర్వహించిన ఇంటికి తీసుకెళ్లకుండా హాస్పిటల్ వద్ద ఆందోళన చేపట్టారు. సూర్యాపేట జిల్లా, మునగాల మండలం తాడ్వాయి గ్రామానికి చెందిన మృతురాలి బంధువులు పెద్ద సంఖ్యలో తరలిరావటంతో పోలీసులు నేలకొండపల్లి, ముదిగొండ, కూసుమంచి మండలాల నుంచి రప్పించారు. ఆరుపులు, కేకలతో హాస్పిటల్ ప్రాంగణం మారుమోగింది. దాదాపు 30 గంటల పాటు మృతదేహం ను నేలకొండపల్లి ప్రభుత్వ హాస్పిటల్ వద్ద ఉద్రిక్తత పరిస్తితులు నెలకొన్నాయి. శాంతిభద్రతలు విఘాతం కలగకుండా కూసుమంచి సీఐ జనార్ధన్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ను నిర్వహించారు. సాయంత్రం నాలుగున్నర గంటల తరువాత ఇరువర్గాల పెద్దల సమక్షంలో అంగీకారం పత్రం ను వ్రాయించుకున్న తరువాత ఆందోళన విరమించారు. గ్రామంలో ఇరువర్గాల పెద్ద ఎత్తున చేరుకున్నారు. మృతదేహం ను సధాశివాపురంలో పోలీసుల పహారా మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరగటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## రూ.3.40కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండలంలో రూ.3.40కోట్లతో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆర్అండ్‌బి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకుస్థాపన చేశారు. పేరాయిగూడెం పంచాయతీ కార్యాలయం నుండి రెండు వైపులా సుమారు 3600మీటర్ల పొడవున జంగారెడ్డిగూడెం రోడ్డు సాయిబాబా గుడి వరకు సిసి డ్రైనేజి పనులకు రూ.2.5 కోట్లతో పాటు మరో రూ.40లక్షలతో డివైడర్ పనులు, మరో రూ.50లక్షలతో సెంట్రల్ లైటింగ్ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా పనులను ప్రారంభించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జూపల్లి ప్రసాద్, తగరం ముత్తయ్య, నంద్రు రమేష్‌బాబు, సుంకపల్లి వీరభద్రరావు, మోహన్‌రావు, అల్లాడి వెంకటరామారావు, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

### -సీతారామ లింక్ కాలువల సందర్శన



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఖమ్మంజిల్లాలో పర్యటించనున్నారు. పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మంత్రి పర్యటన వివరాలను వెల్లడించారు. ఉదయం 9.30కు మహబూబాద్ జిల్లా తోడేళ్లగూడెం వద్ద సీతారామ లింక్ కాలువ పనులను పరిశీలిస్తారని, ఉదయం 10 గంటలకు ఖమ్మంజిల్లా పాలేరు నియోజక వర్గంలోని తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడెం వద్ద పాలేరు ప్రాజెక్టు లింక్ కెనాల్ ఆకేరు జలధారను సందర్శిస్తారన్నారు. ఉదయం 11 గంటలకు దమ్మాయిగూడెంలో సొరంగ ప్రవేశ మార్గాన్ని పరిశీలించి బీరోలు సొరంగ ఆడిట్‌ను పరిశీలిస్తారని దయాకర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహం 12.30కు కూసుమంచి మండలం పోచారం వద్ద కాలువ సొరంగ నిష్క్రమణ భాగాన్ని మధ్యాహ్నం 1.30కు నర్సింహులగూడెం గ్రావిటి కెనాల్‌ను పరిశీలిస్తారన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి కూసుమంచి మంత్రి కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, రెవెన్యూ, పంచాయితీరాజ్, ఆర్అండ్‌బి, ఇరిగేషన్ అధికారులతో మంత్రి సమీక్ష చేస్తారని దయాకర్‌రెడ్డి తెలిపారు.

## పోగొట్టుకున్న డబ్బుని బాధితునికి అప్పగింత



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పెద్ద కోరుకొండి గ్రామానికి చెందిన వేల్పుల సంపత్ కుమార్ ను ఎవరో గుర్తుతెలియని సైబర్ నేరస్తులు మోసం చేసి డబ్బులు ఆన్లైన్ ద్వారా కాజేయగా పోగొట్టుకున్న డబ్బులను గత నెలలో జరిగిన లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించి కోటక్ మహేంద్ర బ్యాంక్ వారి డిమాండ్ డ్రాఫ్ట్ బాధితుడికి అందజేసినట్లు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ డి.ఎస్.పి, సి హెచ్ ఆర్ వి. ఫణిందర్ లు తెలిపారు. ఈ సందర్భంగా బాధితుడు వారికి ధన్యవాదములు తెలిపారు. సైబర్ క్రైమ్ బాధితులు నగదు పోగానే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని వారు కోరారు.

## ఘనంగా వైద్యుల దినోత్సవం



**ప్రజాపక్షం/కల్లూరు:** ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కల్లూరు లో వైద్యుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైద్యశాలలో ఉన్న వైద్యులు నవ్య కాంత్, మౌనిక లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా అధ్యక్షులు గాదే లక్ష్మీ నారాయణలు మాట్లాడుతూ పోయే ప్రాణాన్ని రక్షించే శక్తి వైద్యులకు మాత్రమే ఉందని, రోగుల పాలిట దేవుళ్ళుగా ఉండే వైద్యులని, నోటి నుంచి వచ్చే మాటలు వైద్యులు ఈ మాటలు రోగుల పాలిట దైవంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు నవ్య కాంత్, మౌనిక మాట్లాడుతూ రోజువారి వైద్యం ఎంతో సంతృప్తినిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, నాయకులు దామాల దయాకర్ రావు, ఆసుపత్రి కార్మికులు వంశీ, ప్రమోద్, నాగమణి, రమాదేవి, ఆశ , కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంగుల పుల్లయ్యకు నివాళి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులో సోమవారం జరిగిన సాక్షి దినపత్రిక విలేఖరి తండ్రి గంగుల పుల్లయ్య దశదిన రోజుకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, కౌన్సిల్ సభ్యులు గాదే లక్ష్మీ నారాయణలు హాజరై పుల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగిగా పనిచేస్తూ, ఖాతాదారులకు అనేక సేవలు అందించిన ఘనత, పని సమయంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పీసీసీ సభ్యులు నాగ సీతారాములు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్ రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు వేము రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మొదలైన కొత్తచట్టాల అమలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** దేశవ్యాప్తంగా కొత్త చట్టాలు జూలై 1వ తేది ను ండి అమల్లోనికి భారత ప్రభుత్వం తీసుకొచ్చింది. నేరాల సంఖ్యను తగ్గించేందుకు గానూ, బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు పోలీస్ శాఖ ఈ చట్టాలను అమలు చేస్తుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కొత్తచట్టాలపై పోలీస్‌లకు పలుమార్లు శిక్షణలు ఇచ్చారు. ఇటీవల మారిన సాంకేతిక, డిజిటల్ విధానాలు పెరగడంతో బాధితులకు న్యాయం సకాలంలో అందకుండా పోతోంది. ముద్దాయిలు ఆర్థిక లావాదేవీల నేరాలకు పాల్పడి చట్టం పరిధి నుండి తప్పించుకునే అవకాశాలు ఉండేవి. తద్వారా బాధితులు తీవ్రంగా నష్టపోయే వారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బాధితులకు సత్వర న్యాయం జరిగేలా మూడు చట్టాల్లో మార్పులు తెచ్చారు. దీంతో బాధితులకు న్యాయం జరుగుతుందని పోలీస్,న్యాయశాఖ నమ్ముతోంది.కాగా న్యాయస్థానంపై వాయిదాలపై వాయిదాలు వేయడం వల్ల బాధితులు రోజులు తరబడి కోర్టుల చుట్టూ తిరగడం వల్ల ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా సమయం వృథా అయ్యేది, పైగా న్యాయం కోసం వేచిచూడాల్సిన పరిస్థితుల ఎదురయ్యేవి. ఐపిసి చట్టం స్థానంలో భారతీయ న్యాయ సంవిధాన్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సురక్ష నాగరికత,ఐఇఏ చట్టం స్థానంలో భారతీయ సాక్ష్యా ఆదీన్‌గా మార్పులు చేశారు. దీంతో మోసపోయిన వారికి న్యాయంతో పాటు మోసాలు చేసే వారికి శిక్షలను పెంచారు. చాలా కేసుల్లో నింధితులు తప్పించుకునే అవకాశాన్ని తగ్గించడం వల్ల నేరాల సంఖ్య క్రమంగా తగ్గే అవకాశం ఉందని అటు పోలీసులు, అటు న్యాయ నిపుణులు చెబుతున్నారు. గతంలో ఆర్థిక లావాదేవీల్లో మోసాలకు గురైన బాధితులు ఆస్తులను పోగొట్టుకునే వారు. కానీ కొత్తచట్టాల వల్ల బాధితులకు సత్వర న్యాయం జరుగడంతో పాటు మోసపోయిన ఆస్తులను ఈచట్టం ద్వారా స్వాదీనం చేసుకోనే అవకాశాలు కలుగుతున్నాయి.

**బాధితులకు అవగాహన సదస్సులు...**

మారిన కొత్త చట్టాలపై బాధితులకు వివరించడానికి జిల్లా లీగల్ అథారిటి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించే అవకాశాలున్నాయి. ఈ అవగాహన సదస్సుల ద్వారా ప్రజలకు న్యాయం జరగడానికి వీలుగా వివరించడం జరుగుతుంది. మారిన చట్టాలను ప్రజలకు వివరించడానికి న్యాయ సేవధికార సంస్థ బాధితులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు.

## ఆశ్రమ పాఠశాలకు పర్మనెంట్ టీచర్ పోస్టు మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/కొణిజర్ల :** కాన్వెంటెడ్ ఆశ్రమ పాఠశాలకు పర్మనెంట్ టీచర్ లేకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని వెంటనే పర్మనెంట్ టీచర్ పోస్టును మంజూరు చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలపరిదిలోని బస్వాపురం లో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలను గిరిజన సంఘం బృందం సోమవారం సందర్శించారు. విద్యార్థులు , ఉపాధ్యాయులనుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతు ఆశ్రమ పాఠశాలలో దాదాపు బాలికలు 183 మంది బాలురు 172 మంది విద్యార్థులున్నారని అన్నారు. ఇంగ్లీషు విద్య అందించడానికి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులను నియమించాలని పేర్కొన్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలకు వెనుకభాగంలో ప్రహరీగోడ నిర్మించకపోకవడం వలన రక్షణలేకుండా పోయిందని ఐటిడిఏ అధికారులు వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని అన్నారు. మరుగుదొడ్లు నిర్మించాలని అన్నారు. గణితం , జీవశాస్త్రం పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెంటనే భర్తీ చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కమిటి సభ్యులు తేజావత్ సీతారాములు , కొణిజర్ల మండల కార్యదర్శి బాణోత్ హరిచంద్ , ధరావత్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలంలోని ఎల్చి రెడ్డిపల్లి కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలలను పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, వసతుల ఏర్పాట్ల లో రాజీ పడేది లేదని, ఇబ్బందులు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించాల్సిన గురుతర బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిన ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతోందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సరిపడా నాణ్యమైన భోజనం పెట్టాలని హెచ్ ఎం ని ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని భోజనశాల, విద్యార్థుల వసతి గదులను పరిశీలించి, గదుల్లో ప్యాన్ లు,లైట్ లు పనిచేయకపోవడంతో వెంటనే రిపేర్ చేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎల్చిరెడ్డిపల్లిగిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే పాయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిన ఆహారాన్ని పరిశీలించారు. మొత్తం ఎంతమంది విద్యార్థులకు భోజనం తయారు చేశారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ను ఇస్తోందని, పేదరికం కారణంగా ఎవరూ విద్యకు దూరం కాకూడదని సూచించారు. వర్షం కాలం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వారం పాఠశాలల్లో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి,విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. వసతుల కల్పనలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పాఠశాలలు, హాస్టల్ ప్రాంగణాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం పాఠశాలల అవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. నాటిన మొక్కలను కాపాడేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీ సీ డీ ఓ అన్నమణి, ఎంపిడిఓ రామకృష్ణ, ఎంపీఓ కే. వేంకటేశ్వరరావు, ఎం ఈ ఓ వీరాస్వామి, ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ విజయ్ కృష్ణ, కస్తూర్బా పాఠశాల యస్ ఓ స్రవంతి పాల్గొన్నారు.

## ఓసి 2 నూతన కార్యాలయం వద్ద బురద నివారించాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఏరియా పీకే ఓసి పరిధిలోని ఓసి2 నూతన కార్యాలయం ప్రాంగణం భారీ వర్షాలకు అంతా బురదమయం అయిందని ఎస్ అండ్ డి సెక్షన్ కార్మికులు మ్యాన్ వే వద్దకు వెళ్లి ఇన్ మస్టర్ పడాలన్నా ,అవుట్ మస్టర్ చెప్పాలన్నా చాలా ఇబ్బంది పడాల్సి వస్తున్నదని, జారుడు బల్ల పై నుండి పిల్లలు జారినట్లుగా తమ వెతలు ఉన్నాయని కార్మికులు వాపోతున్నారు. అధికారులు, కార్మిక సంఘాల నాయకులు తమ సమస్యను పరిష్కరించాలని సామాజిక మాధ్యమాలు వేదికగా ఓసి టు ఎస్ అండ్ డి సెక్షన్ కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# దోచుకున్నోళ్లకి దోచుకున్నంత..?



-విద్యాశాఖాధికారి కార్యాలయానికి తాళం

-ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీకి వత్తాసు పలుకుతున్న అధికారులు

-ఉన్నతాధికారులు కలగజేసుకొని చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రుల వేడుకోలు

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థలు ఏజెన్సీ ప్రాంతంలో హద్దు అదుపు లేకుండా దోపిడీకి పాల్పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నియమ నిబంధనలు ఇక్కడ తుంగలో తొక్కినట్లుగా మండలంలో పలు ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యవహారిస్తున్నప్పటికీ విద్యాశాఖాధికారి మాత్రం తనకేమి పట్టనట్టుగా వ్యవహారిస్తున్న తీరు ప్రజలను విస్మయానికి గురి చేస్తుంది. ఫీజులను ప్రభుత్వ నియమాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పలు ప్రైవేట్ విద్యాసంస్థల గుప్పిట్లో పని చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో పలు ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీపై ఫిర్యాదు చేయాలని ఏవరైనా కార్యాలయానికి వస్తే ఎప్పుడు ఆ కార్యాలయానికి తాళం వేసి ఉండటం విడ్డూరం. పలు ప్రైవేట్ విద్యాసంస్థలకు సమస్య వస్తే ప్రతి పని భద్రాచలం కేంద్రంగా జరుగుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలోని 14 ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండగా అందులో పలు ప్రైవేట్ విద్యాసంస్థలు పూర్తి స్థాయిలో ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా, నిబంధనలకు నీళ్లు వదిలి ఇష్టారాజ్యంగా వ్యవహారిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పలు ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యవహారిస్తుంటే చర్యలు తీసుకోకపోవడం వెనుక అమ్యామ్యాలు కారణం అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు మండల కేంద్రంలోని కార్యాలయానికి ఆయన ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి. కానీ ఆయనకు పని ఉంటే కార్యాలయానికి వస్తారు తప్ప మిగిలిన సమయంలో కార్యాలయానికి రారు అని పలువురు తెలుపుతున్నారు. ఇలా ఆయన తీరుకు ఆ శాఖలో పలువురు ఉన్నతాధికారులు వత్తాసుగా నిలవడంతో ఆయన ఆడిందే ఆటగా సాగుతుందనే మాట ప్రజల నోట నుండి వినిపిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మండల విద్యాశాధికారి ఆధీనంలో ప్రైవేట్ విద్యాసంస్థలు లేవని, ప్రైవేట్ విద్యాసంస్థల ఆధీనంలో మండల విద్యాశాధికారి కార్యాలయం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలో ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ వత్తాసుగా ఆ శాఖ అధికారుల తీరు ఉండటం కొసమెరుపు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాధికారి స్పందించి ఆర్థిక దోపిడీకి గురవుతున్న విద్యార్థులు తల్లిదండ్రులకు భరోసాగా నిలిచి, మండలంలో పలు ప్రైవేట్ విద్యాసంస్థల తీరులో మార్పుతో పాటు విద్యాశాఖలో సైతం మార్పులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రైతు భరోసా పథకం ప్రతి రైతుకు అందించాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రైతు భరోసా పథకం ప్రతి రైతుకు అందించాలని బూర్గంపాడు సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం బూర్గంపాడు మండల కేంద్రంలోని రైతు వేదిక నందు ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా పథకంపై రైతుల యొక్క సూచనలు, సలహాల నిమిత్తం ప్రత్యేక మహాజన సభ సమావేశం సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈమహాజన సభ సమావేశంలో జిల్లా సహకార అధికారి ఎస్‌డి ఖుర్షీద్, ఏడిఏ తాతారావులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని రైతుల నుండి రైతుభరోసా పథకంపై అభిప్రాయలు సేకరించి అట్టి అభిప్రాయలను ప్రభుత్వానికి పంపుతామని, కావున రైతులు రైతు భరోసా పథకంపై సూచనలు, సలహాలు తెలియజేయాలన్నారు. రైతు భరోసా పథకంపై రైతుల సలహాలు రికార్డు చేసి ప్రభుత్వానికి పంపుతామని, రైతులు యొక్క అభిప్రాయలను గౌరవిస్తామన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు రైతు భరోసా పథకం వర్తింపజేయాలని తెలిపారు. ఈ ప్రత్యేక మహాజన సభలో సొసైటీ డైరెక్టర్లు, రైతులు తెలియజేసిన అభిప్రాయలను రికార్డు చేసి ప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు ఆవుల నాగిరెడ్డి, మానిటరింగ్ అధికారి టి సుజాత, డిసిసి బ్యాంక్ బూర్గంపాడు మేనేజర్ వసుమతి, మండల అగ్రికల్చర్ అధికారి ఆర్ శంకర్, ఏఈవోలు ప్రసాద్, వైష్ణవి, సొసైటీ డైరెక్టర్లు బొల్లు రవి, కోడి లింగయ్య, బత్తుల రామకొండారెడ్డి, కుందూరు పెద్దిరెడ్డి, తోకల అనిత, మేడ్గం రామిరెడ్డి, బోడ గోపిరాథ్, ఉండేటి గోవర్ధన్ , రైతులు, సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జిలతో సింగరేణి కార్మికుల నిరసన




**ప్రజాపక్షం/మణుగూరు:** బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒడిశాలో రెండు గనులను నై వెళ్ళి లిగ్నైట్ లిమిటెడ్ కు కేటాయింపు, గుజరాత్ లో గుజరాత్ మినరల్ డేవలప్ కార్పొరేషన్ వారికి తమిళనాడులో ప్రభుత్వ సంస్థకు బొగ్గు గనులను నామినేషన్ పద్ధతిలో ఎలాంటి వేలం లేకుండా కేటాయింపు చేసిన బి జె. పి మోదీ ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్రం పై కక్ష్య సాధింపు చర్యలు చేపడుతూ సింగరేణి గనులపై కుట్రపన్ని ద్వంద వైఖరి అవలంభిస్తోందని గుజరాత్ రాష్ట్రం కు కు ఒక నీతి? తెలంగాణ రాష్ట్రానికి మరొక నీతిగా వ్యవహరించే విధానాన్ని నిరసిస్తూ మణుగూరు ఏరియా టి బి జి కె యస్ నేతృత్వంలో అన్ని గనులు డిపార్ట్ మెంట్ లలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గనులు, డిపార్ట్ మెంట్ ల పై ఉన్న అధికారులకు వినతి పత్రాలు అందించారు. గనుల వేలంలో సింగరేణి యాజమాన్యం పాల్గొనకుండా నామినేషన్ పద్ధతిలో గనులు దక్కే విదంగా తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి సింగరేణి గనులను పరిరక్షణ చెసి సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని వారంత వినతి పత్రాలు అందించారు. టి బి జి కె యస్ సెంట్రల్ కమిటి ఇచ్చిన పిలుపులో భాగంగా ఏరియా టి బి జి కె యస్ బ్రాంచి ఉపాధ్యక్షులు నాగేళ్ళి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం ఉదయం షిఫ్ట్ నందు కార్యక్రమం నిర్వహించారు. ఏరియా లోని ఓ సి 2, ఓ. సి 4, కొండాపురం భూగర్భ గని, కె. సి. హెచ్.పి, వర్క్ షాప్, ఏరియా స్టోర్స్, ఏజెంట్ అఫీస్, జి యం అఫీస్, వృత్తి విద్య శిక్షణ కేంద్రం, ఏరియా హాస్పిటల్ నందు పెద్ద ఎత్తున కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఏరియా నందు 1000 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. జులై 3 న కేంద్ర, రాష్ట్ర దిష్టి బొమ్మల దగ్ధం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అందులో ఏరియా కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని టి బి జి కె యస్ కు మద్దతుగా నిలవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షులు నాగేల్లి వెంకటేశ్వర్లు, బంగారి పవన్ కుమార్, ఇబ్రాయిల్, రామచారి, మునిగేల నాగేశ్వర రావు, షేక్ మస్తాన్ , హరి ప్రసాద్, ఇమ్రాన్ మురళీకృష్ణ, రాజ్ కుమార్, ముకేశ్, వినయ్ కుమార్, పద్దం శ్రీనివాస్, జనార్ధన్, దుర్గ ప్రసాద్, కిరణ్, రేవన్, నరేందర్, రమేష్, సుమన్, సాయి వంశీ, సాత్విక్ యాదవ్, సతీష్, ప్రసాద్, శంకరయ్య,బీరయ్య, రాజేష్, విఠల్, రమేష్, అశోక్ రెడ్డి, వెంకటేష్ , రాజేష్, రమేష్, హరి కృష్ణ, పవన్ కుమార్, ఏడుకొండలు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నేతకాని ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/కరకగూడెం:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎంపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నేతకాని కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నేతకాని యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీఎస్ నేత దుర్గం సంతోష్ ఒక ప్రకటనలో కోరారు. నామినేటెడ్ పదవుల్లో, రాజ్యసభ ఎమ్మెల్సీ వంటి పదవుల్లో మా నేతకాని కులస్తులకు అవకాశం కల్పించాలని కోరారు. అలాగే నేతకాని సోదరులు సాగు చేసుకున్నటు వంటి పొడు భూములకు హక్కు పత్రం కల్పించి, పట్టాలు ఇవ్వాలని కోరారు.

## పిఆర్ ఏఈకి పదోన్నతి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పంచాయితీ రాజ్ శాఖ ఏఈగా బూర్గంపాడు మండలంలో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావుకు పదోన్నతి లభించింది. ఈ పదోన్నతిలో భాగంగా భద్రాచలం డివిజన్ పంచాయితీ రాజ్ డిఈగా బాధ్యతలు చేపట్టనున్నారు. సోమవారం మండలంలో విధులు నిర్వహించి పదోన్నతిపై వెళ్తున్న ఆయనను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

## డ్రైనేజీ నిర్మాణంపై గ్రామస్తుల తీర్మానం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ ప్రధాన సెంటర్ నుండి ముత్యాలమ్మ లంకల వరకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణానికి రూ 3కోట్ల 20లక్షల నిధులు మంజూరు ఆయన విషయం విధితమే. దీంతో ఇరువైపులా యాజమానులతో పాటు గ్రామస్తులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు 22 అడుగులతో డ్రైనేజీ నిర్మించుటకు తీర్మానించుకున్నమని దీనిని అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నాయకులకు వినతి పత్రాన్ని గ్రామస్తులు అందజేశారు. ఈసమావేశంలో కుక్కడకు నరసింహారావు, కడియాల నాగేశ్వరరావు, సంకా రామారావు, సీతారాములు, సంపత్, జైనుతి బేగం, తదితరులు పాల్గొన్నారు.

## లాంగ్ స్టాండింగ్ అధికారులను బదిలీ చేయాలి

**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి సంస్థలో సీఎన్ఎండి లు మారినా లాంగ్ స్టాండింగ్ అధికారులు మారడం లేదని, లాంగ్ స్టాండింగ్ అధికారులను బదిలీ చేయాలని కార్మిక సంఘాల నాయకులు జాతీయ సంఘాలు, కార్మికులు కూడా డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సింగరేణి కంపెనీలో గత కొన్ని సంవత్సరాలుగా వివిధ డివిజన్ లలో పనిచేస్తున్న అధికారులు కంపెనీలో తిష్ట వేసి కూర్చున్నారని, ఫోకల్ పాయింట్ లో పనిచేస్తున్న అధికారులను కూడా బదిలీ చేయకపోవడం బాధాకరమని, సింగరేణి కంపెనీలో నిబంధన ప్రకారం మూడు నుండి ఐదు సంవత్సరాలకు క్రమం తప్పకుండా తప్పనిసరిగా బదిలీ చేయాలని నిబంధనలు ఉన్నా కూడా వాటిని బేఖాతలు చేస్తూ బదిలీ కాకుండా మణుగూరు ఒక్క డివిజన్ లోనే వారికున్న అధికారులను పైన ఒత్తిడి తెచ్చి మణుగూరు ఒక డివిజన్ లో మాత్రమే ఉంటారని అంటున్నారని కొందరు అధికారులు సింగరేణి కంపెనీ ఒకే కుటుంబం, ఒకే లక్ష్యం, ఒకే గమ్యం అని పదేపదే చెప్పే యజమాన్యం చాలా ఏండ్లుగా తిష్ట వేసిన అధికారులకు ఒక న్యాయమా.. మరికొందరికి మరో న్యాయమా.. అని గుసగుసలు వినబడుతున్నాయి.

## సంక్షేమ బోర్డులో ఉన్న వివాహ, సహజ మరణ కానుకలను తక్షణమే పెంచాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిల్ ఇస్తామని అసెంబ్లీలో కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి హామీ ఇచ్చారని కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులందరికీ మో టార్ సైకిల్ తక్షణమే ఇవ్వాలని సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మండల కేంద్రంలోని భవన నిర్మాణ కార్మికులకు రెస్ట్ తీసుకునేందుకు స్థలం కేటాయించి షెడ్ నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డులో ఉన్న కానుకలు, సహజ మరణ కానుక లక్షల ముపై నుండి రూ 5లక్షలకు పెంచాలని, ప్రసూతి కానుక రూ 30వేల నుండి రూ 1లక్షలకు పెంచాలని, వివాహ కానుక లక్ష రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సూరం పుల్లారావు, కార్యదర్శి ఓరుగంటి శ్రీను, పొక్కిలి దానియేల్, సంగు శ్రీను, హలవత్ శివ, కొడితే వీరభద్రం, శ్రీను, సుధాకర్, అనిల్, భూక్యా భద్రు, ముడివి మల్లేష్, పొక్కిలి రవి, మందా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి



**- ఉపాధి కల్పించేందుకు జాబ్‌మేళాలు నిర్వహించడం అభినందనీయం : కూనంనేని**



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** యువత అవకాశాలను అందిపుచ్చు కుని జీవితాల్లో స్థిరపడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనం నేని సాంబశివరావు అన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వ ర్యంలో సోమవారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో మెగాజాబ్ మేళా జరి గింది. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఉపాధి కల్పన అధికారి వేల్పుల విజేతతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం కేంద్రంగా మేగా జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకా శాలు కల్పించడం నిజంగా అభినందనీయం అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు దొరకడమే కష్టంగా మారిందని, అలాంటిది ఇక్కడ చదువులేని వారి నుండి మొదలుకుని పీజీల, పిహెచ్‌డిలు చది విన వారికి కూడా ఉద్యోగ అవకాశాలు కల్పింస్తున్నారని చెప్పారు. ఇలాంటి అవకాశాలు ప్రతీ సారి రావని చెప్పారు. ఉద్యోగాలు సాధిం చిన వారు రకరకాల కారణాలు చెప్పి ఉద్యోగాలు వదిలిసి వస్తున్నట్లు తమ దృష్టికి వస్తుందని, ఇది మంచిపద్ధతి కాదన్నారు. ఉద్యోగం ద్వారా సంపాదించిన మొదటి సంపాదనతో మీ తల్లిదండ్రులను సంతోషపె ట్టండి,ఎంతో కష్టపడి మీరు ఈ స్థాయికి ఎదిగేందుకు వారు అహర్ని శలు శ్రమించారని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ తాను కూడా చాల చిన్న కుటుంబంలో జన్మించానని, నా తల్లిదండ్రులు ఇద్దరూ కష్టపడి చదవించడం వల్లే ఈ స్థాయికి చేరుకు న్నట్లు తెలిపారు. గొప్పగొప్ప జీవితాలు ముందుగా కష్టంతోనే మొదల వుతాయని, నమ్ముకుని ముందుకు సాగితే అవే బ్రతుకులను మలుపుతి ప్పుతాయన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, పిజి, ఎంబిఏ, ఎంసిఏ, బిటెక్, ఎంటెక్, ఎంసిఏ, బీ ఫార్మసి, ఎం ఫార్మసి,హోటల్ మేనేజ్మెంట్ చదివిన వారు ఈ జాబ్‌మేళాలో పాల్గొన్నారు. మొత్తం 60 ప్రముఖ ప్రైవేటు కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొనగా, మొత్తం 1531 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. తొలివిడతగా 603 మందికి, తదుపరి ఇంటర్వ్యూకి 928 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో మొదటి పది మందికి ఎంఎల్‌ఏ చేతుల మీదుగా నియామకపు పత్రాలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతామహా లక్ష్మీ, మున్సిపల్ కౌన్సిలర్లు ధనరాజు, జమలయ్య, జిల్లా యువత, క్రీడల అధికారి సంజీవరావు, సూపరింటిండెంట్ ఉదయ్‌కుమార్ సిబ్బంది తిరుమలరావు, లక్ష్మయ్య, సిపిఐ నాయకులు ఎస్‌కె సాబీర్ పాషా, వంగా వెంకట్, పూర్ణచంద్రరావు, జోసఫ్‌తో పాటు పాల్గొన్నారు

# 50 వేల మొక్కలను నాటాలి



**ప్రజాపక్షం–నేలకొండపల్లి:** మండలం లోని వివిధ గ్రామా లలో వన మహోత్సవం ను విజయవంతం చేయాలని నేల కొండపల్లి ఎంపీడీఓ యం. యర్రయ్య సూచించారు. మం డల కేంద్రంలోని మొక్కలు నాటేందుకు తీస్తున్న గుంత లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో మొత్తం 50 వేల మొక్కలను నాటేలా కార్యచరణ ను రూపొందించినట్లు పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్నందున్న ముందస్తుగా గుంతలు తీసి సిద్ధంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే మొక్కలు నాటే కార్యక్రమం ను ప్రారంభించాలని సూచించారు. ప్రతీ పంచాయతీలకు ఇచ్చిన లక్ష్యం ను నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు. నర్సరీలో మొక్కలను సిద్ధం చేసి ఉంచాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమం ను విజయవంతం చేయాలని కోరారు. ప్రతీ ఒక్కరికి సామాజిక బాధ్యత గా తీసు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో సునీత, ఈసీ శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, టీఏ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి



**ప్రజాపక్షం–నేలకొండపల్లి :** వర్షాకాలం లో సీజన్ లో వచ్చే వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం ను ఎంపీడీఓ కు బీజేపీ నాయకులు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...గ్రామాలలో పారిశుద్యం అధ్వానంగా ఉందని అన్నారు. పంచాయతీలలో చెత్త చెదారం తో దోమలు చేరి రోగాల బారిన పడుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు చెప్పిన పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజారోగ్యంపై పాలకులు శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. గ్రామాల వారీగా ఆరోగ్య శిభిరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మోహినుద్దీన్, రామకృష్ణ, పిట్టల సూరిబాబు, కె.రమణ, జీ.వెంకటేశ్వర్లు , వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ అధికారులను నిలదీసిన ఏదులాపురం గ్రామస్తులు





**- ప్రజాపక్షం కథనాలను జతచేసి అధికారులకు వినతి**
**- సీపీఎం, కాంగ్రెస్ ఆధ్వర్యంలో కబ్జాపై వినతి**



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఏదులాపురం చెరువు కబ్జాపై రెవిన్యూ అధికారులను గ్రామస్థులు సోమవారం నిలదిశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన రెవిన్యూ సదస్సులో ఆక్రమణలపై గళమెత్తారు. సర్టిఫికెట్ కోసం సామాన్యుడుని నిబంధనలపై ప్రశ్నించే అధికారులకు నెలలుగా మట్టితోలకాలు, చెరువు ఆక్రమణపై ఎందుకు స్పందించడం లేదంటూ వాదించారు. ఇప్పటికే ఓ వైపు వెంచర్లు, మరో వైపు చెరువులో మట్టిపోసి కబ్జా చేసుకుంటున్నారంటూ ఆవేదనవ్యక్తం చేశారు. దీనిపై అధికారులు తమకు సంబంధించినది కాదని, ఇరిగేషన్ అధికారులది చెరువు భాధ్యత అన్నారు.ఈ సందర్భంగా ప్రజాపక్షం దినపత్రిక వరు సగా ప్రచురించిన కథనాలను జత చేసి ప్రజలు వినతిపత్రాన్ని అందజే శారు. అందులో రెవిన్యూకు సర్వేకు సహకరించాలని, ఇరిగేషన్ అధికా రులు లెటర్ పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. సమస్య తీవ్రత రంగా ఉందని, రెవిన్యూ ఆధ్వర్యంలో తక్షణమే సర్వే నిర్వహించి కబ్జా లను వెలికితీయాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు వినతి పత్రాన్ని స్వీకరించి, ఉన్నతస్థాయి అధికారుల తెలియపరుస్తామన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో మేళ్లచెర్వు వెంకన్న, మేళ్లచెర్వు సురేష్, పొన్నెకంటి రమేష్, పాలేరునియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్య క్షుడు భూక్యసురేష్‌నాయక్ ఉన్నారు.

**సీపీఎం,కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం...**

స్థానిక సీపీఎం, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో సంతకాలు చేసిన వినతి పత్రాన్ని నాయకులు ఊరడి సుదర్శన్‌రెడ్డి చెరువు కబ్జాపై రెవిన్యూ అధి కారులకు అందజేశారు. కొందరు రెవిన్యూ ఉద్యోగుల సహాయసహకా రాలతో చెరువు ఆక్రమణ చేసుకుని, ప్రజలు, ప్రభుత్వాన్ని మోసం చేస్తు న్నట్లు అందులో పేర్కొన్నారు. 18,06,2019లో అప్పటి జిల్లా కలెక్ట ర్‌కు చెరువు కబ్జాపై ఫిర్యాదు చేశామని, ఆయన ఆదేశించినప్పటికీ రెవిన్యూ నుంచి ఎటువంటి చర్యలు లేవన్నారు. అధికారులు దురాక్రమ ణదారులకు పాసుబుక్కులు మంజూరు చేశారన్నారు. కావున తక్షణమే సర్వే చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, పాసు బుక్కులను రద్దు చేసి ప్రభుత్వ ఆస్తిని కాపాడాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నుంచి వెంపటి రవి, సీపీఎం నుంచి జయప్రసాద్(జేడీ), వెంకటేశ్వర్లు, ఎమ్ నర్సిరెడ్డి, నాగయ్య, లింగయ్యల పేర్లపై అందించారు.

# ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** భద్రాచలం రోడ్డు రైల్వే సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూని యన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహిం చారు. కొత్తగూడెం రైల్వే కాలనీలో గల డాక్టర్ రాజేంద్రకుమార్‌ను శాలువా వేసి పూలమాలతో ఘనంగా సత్కరించారు. కొత్తగూడెం లోని రైల్వే కార్మికులకు ఉద్యోగు లకు రాజేంద్రకుమార్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ప్రెసి డెంట్ కామ్రేడ్ షేక్ కాజాబాబా, యూత్ కార్యదర్శి బస్వరి పుల్లయ్య, కార్మిక సంఘాల నాయ కులు, రైల్వే ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి రావెళ్ళ సత్యనారాయణ, రవి రాజ్, ఇంతియాజ్, వెంకటేశ్వర్లు, మనోజ్, సరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్, బల్లల వితరణ




**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ లయన్స్ క్లబ్ అధ్యక్షులు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సోమవా రం నిరుపేద మహిళల కు కుట్టుమిషన్, తల్లాడ, నారాయణపురం గ్రా మాల్లో సిమెంట్ బల్లలు వితరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ బస్టాండ్ ఎదురుగా, హెచ్‌పి పెట్రోల్ బంక్ ఎదురుగా, రామాలయం దగ్గర, జనసమూహాలు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ కర్నాటి లక్ష్మారెడ్డి, క్యాబినెట్ డిసి మిట్టపల్లి నర్సింహారావు, సెక్రటరీ నంబూరు కనకదుర్గ ప్రసాద్, ఎలెక్ట్ అధ్యక్షులు బెల్లంకొండ ఆంజనేయులు, ఎలక్ట్ సెక్రటరీ కటికి వెంకటేశ్వరరావు, ట్రెజరర్ సేలం వెంకటరెడ్డి, రాయల గోవిందరావు, జవాజి నగేష్, మిట్టపల్లి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు పెంచడం మన బాధ్యత



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో సోమవారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వైరా మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్, మున్సిపాలిటీ కమీషనర్ వేణుతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ జైపాల్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని అన్నారు. కమీషనర్ వేణు మాట్లాడుతూ చెట్లు పెంచడం వలన ఎంతో ఉపయోగం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమారి, వైస్ ప్రిన్సిపాల్ కుసుమ, సానిటరి ఇన్స్‌పెక్టర్ సైదులు, వార్డు ఆఫీసర్స్, మెప్మా ఆర్‌పిలు, మున్సిపాలిటీ సిబ్బంది, స్కూల్ విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరి వరదల పట్ల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. స్థానిక ఐటిడిఏ సమావేశ మందిరంలో సోమవారం గోదావరి వరదలపై అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గోదావరి వరదల వల్ల ముంపుకు గురయ్యే మండలాలు, చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిఓ మాట్లాడుతూ గోదావరి వరదలు ఏజెన్సీ ప్రాంతంలో పెద్దఎత్తున వస్తున్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ముంపు ప్రాంతాల వారిని ముందస్తుగానే గుర్తించి పునరవాసా కేంద్రాలకు ఎప్పటిమాదిరిగానే పంపాలన్నారు. వరదల సమయంలో ఉద్యోగులు సెలవులు పెట్టరాదని, అధికారుంతా సన్వయంతో సమిష్టిగా పనిచేయాలన్నారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు, బాధితులకు అందాల్సిన సౌకర్యాలపై ఇప్పటి నుండే ప్రణాళికా బద్దంగా ముందుకు సాగాలని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టంతో పాటు మూగ జీవాలకు కూడా నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది 24 గం.పాటు అందుబాటులో ఉండాలని, గోదావరి వరద పొంగే ప్రదేశాల వైపు ప్రజలు వెళ్లకుండా పోలీస్ అధికారులు, పంచాయితీ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నదీ పరివాహక ప్రాంతాల్లో గజీతగాళ్లతో పాటు మరపడవలను, లైఫ్ జాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజు, డిడి మణెమ్మ, ఆర్డిఓ దామోదర్ రావు, ఇరిగేష్ ఇఇ రాంప్రసాద్, డిఇ తిరుపతి, ఉపేంధర్, రాము, ఎంపిడిఓలు, తహశిల్దార్లు, ఎంపిఓలు, ఐటిడిఏ యూనిట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి





**ప్రజాపక్షం/భద్రాచలం :** వర్షాకాల సీజన్ ప్రారంభమైనందున ఆదివాసీ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సత్వర వైద్య సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఐటిడిఏ పిఓ బి రాహుల్ తెలిపారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారుకు హాజరైన ఆయన పలు గిరిజన గ్రామాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తమ పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టిన సంఓేమ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదన్నారు.

**ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి...**

ప్రజావాణి ద్వారా జిల్లా నలు మూలల నుండి వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నమ్మకంతో వచ్చిన సమస్యలపైదరఖాస్తులు చేసుకుంటారని, అట్లాంటి వారి నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అందిన దరఖాస్తులను రిజిష్టర్‌లో నమోదు చేసుకుని వారికి రశీదు ఇవ్వాలని చెప్పారు. పరిష్కారానికి నోచుకోని వాటిపై వివరణ ఇవ్వాలన్నారు. అనంతం జిల్లా నలు మూలల నుండి వచ్చిన వారి నుండి పలు రకాల దరఖాస్తులు స్వీకరించారు.

# నూతన చట్టాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** దేశ వ్యాప్తంగా జూలై 1 నుండి పోలీస్‌శాఖలో నూతన చట్టాలు అమలవుతున్నాయని, వీటి పట్ల నేరగాళ్లు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తల్లాడ ఎస్సై బి.కొండలరావు సూచించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఐపిసి, సిఆర్పీసీ, ఐఇఎ చట్టాలు ఉండేవని, వాటి స్థానంలో మరో మూడు కొత్త చట్టాలు వచ్చినట్లు వెల్లడించారు. భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), భారతీయ నగరిక్ సురక్ష సంహిత( బిఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్(బిఎస్ఎ) మూడు చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. ఈ చట్టాలతో బాధితులకు సత్వర న్యాయంతో పాటు దర్యాప్తు చేసే అధికారిపై మరింత బాధ్యతను పెంచారని, అన్ని నేరాల్లో శిక్షణ పెంచినట్లు వెల్లడించారు. 33నేరాల్లో గతంలో కంటే పెంచారని, 83నేరాల్లో జరిమానా పెంచినట్లు వివరించారు. 23 నేరాల్లో కనీస శిక్ష అమలు చేస్తున్నట్లు తెలిపారు. సాక్షులు, నిపుణులు, నేరస్థులు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు నందు హాజరు కావచ్చునన్నారు. ప్రస్తుతం శిక్షలు కఠినంగా ఉన్నందున ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఒకసారి నేరం చేసిన వ్యక్తి మరోసారి అదే నేరం చేస్తే ఆ వ్యక్తిపై కఠినంగా శిక్షలు ఉంటాయన్నారు.

**జిల్లాలో నూతన చట్టాలపై శిక్షణ ఇచ్చిన తల్లా డ ఎస్సై ...**

ఈ నూతన చట్టాల పట్ల గత నెల రోజుల నుండి ఖమ్మం సిపి ఆధ్వర్యంలో జిల్లా మూడు చోట్ల జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి ముందుగానే తల్లాడ ఎస్సై బి.కొండలరావు శిక్షణ అందించారు.

# ఫర్జానా బేగం సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** గత 34సంవత్సరాలుగా ఉపాధ్యాయ, వృత్తిలో ఉంటూ అంకిత భావంతో పనిచేసి ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది,ఉనాతాధికారుల ప్రశంసలు పొంది నేడు ఉద్యోగ విరమణ చేస్తున్న మొమహమ్మద్ ఫర్జానబేగం సేవలు అభినందనీయమని మండల విద్యాధికారి శ్యాంసన్ అన్నారు. మండలంలోని జలగంనగర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో నేడు ఉద్యోగ విరమణ చేస్తున్న ఫర్జానాబేగంకు పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు..వినయం, విధేయతో ఉపాధ్యా వృత్తికే వన్నె తెచ్చిన వినయశీలి ఫర్జాజనా అని కొనియాడారు. అజాతశత్రువని ఎంతపని ఒత్తిడిలో ఉన్నా విద్యార్థుల పట్ల,తోటి ఉపాధ్యాయులు పట్ల ఎంతో వాత్స్యాలంతో ఉండే వారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో అనేక శేషజీవితం ఆహ్లాదంగా, సంతోషంగా సాగాలని కోరారు. ఫర్జానా సోదరు మొహమ్మద్ యాసిన్ మాట్లాడుతూ..మేము ఐదుగురుంతోబుట్టువులమని అందరిలో ఫర్జానా ఒక్కరే సోదరి అని, తమ నలుగురు సోదరులు ఉద్యోగ, వ్యాపార రంగాలలో అత్యున్నత స్థాయిలో ఉన్న,తమ సోదరి ఉపాధ్యాయురాలుగా ఉండటం తమ కుటుంబానికేంతో గర్వకారణమని తెలిపారు. అన్ని వృత్తులోకెల్లా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఫర్జానాబేగం కుటుంబ సభ్యులు మొహమ్మద్ యూసఫ్‌రెహనా, మొహమ్మద్ సలీం, రజీయా, సల్మాన్‌సికిందర్, తబస్సుమ్ షహనాజ్, నీలోఫర్ తబస్సుమ్‌రఫియెద్దీన్, ఆర్ వై ఫౌండేషన్ అధినేతలు తన్వీర్ నానీజనీన్, తస్నీన్ నాజనీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఎస్‌పి పారితోష్ పంకజ్ బదిలీ

# కొత్త ఏఎస్‌పిగా అంకిత్ కుమార్





**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం ఏఎస్‌పి విధులు నిర్వహిస్తున్న పారితోష్ పంకజ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్రంలో చోటు చేసుకున్న ఐపిఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఈయనను కొత్తగూడెం ఓఎస్‌డిగా విధులు నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2020 బ్యాంచ్‌కి చెందిన పంకజ్ భద్రాచలం ఏఎస్‌పిగా గత ఏడాది జనవరి 30న బదిలీపై వచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టు కదలికలను ఎప్పటికప్పుడు పసిగడుతూ అడవుల్లో కూంబింగ్ చేసే విధంగా వ్యూహరచన చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన చర్ల మండలంలోని ఉంజుపల్లి, కొర్కటపాడు తదితర గ్రామాల్లో ప్రజలతో మమేకమై మావోయిస్టు పార్టీకి ప్రభావితం కావడం వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ వారికి కావాల్సిన నిత్యవసరాలు పంపిణీ చేయడంతో పాటు యువతకు వాలీబాల్, ఇతర ఆటల పోటీలు పెట్టి ప్రోత్సహిస్తూ చెడుమార్గాల్లో నడవకుండా ప్రయత్నం చేశారు. భద్రాచలం లో జరిగే శ్రీరామ నమవి, ముక్కోటి వంటి ఉత్సవాలు విజయవంతానికి కృషి చేసారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అల్లర్లు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ శాంతిభద్రత పరిరక్షణకు పెద్దపీఠ వేశారు.

**నూతన ఏఎస్‌పిగా అంకిత్ కుమార్...**

భద్రాచలం నూతన ఏఎస్‌పిగా అంకిత్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. 2020 ఐపిఎస్ బ్యాంచ్‌కి చెందిన ఈయన జనగాం, వరంగల్ ఏఎస్‌పిగా పనిచేస్తూ భద్రాచలం ఏఎస్‌పిగా బదిలీ అయ్యారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసిన అనుభవం ఉన్న అంకిత్‌ను ప్రభుత్వం భద్రాచలం ఏజెన్సీకి పంపించింది.

# చంటి పాప వైద్యానికి ఐటిడిఏ రిలీఫ్ ఫండ్



**ప్రజాపక్షం/భద్రాచలం :** పుట్టక నుండి దీర్ఘ కాలిక వ్యాధితో బాధపడుతున్న చంటి పాప వైద్యం నిమిత్తం ఐటిడిఏ రిలీఫ్ ఫండ్ ద్వారా ఐటిడిఏ పిఓ బి రాహుల్ ఆర్థిక సహాయాన్ని అందించారు. కొత్తగూడెం జిల్లాలోని సుజాతనగర్ మండలంకు చెందిన మాలోత్ సౌమ్య తన బిడ్డ పుట్టుకతో దీర్ఘ కాలిక వ్యాధితో బాధపడుతుందని వైద్యానికి సహాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో కలెక్టర్ ఐటిడిఏకు అధికారులను ఆదేశించడంతో రూ.25 వేల చెక్కును వైద్యం కోసం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, పాప తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అర్హులైన పోడుదారులకు పట్టాలివ్వాలి

**- సిపిఐ ఎంఎల్ మాజీ ఎంఎల్ఏ గుమ్మడి నర్సయ్య**




**ప్రజాపక్షం/భద్రాచలం :** ఏజెన్సీలో అర్హులైన గిరిజనులందరికీ పోడుపట్టాలివ్వాలని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ మాజీ ఎంఎల్ఏ గుమ్మడి నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలో ఆపార్టీ ఆధ్వర్యంలో ఐటిడిఏ వరకు ర్యాలీ నిర్వహించి గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీ గ్రామాల్లో మౌళిక సదుపాయాలతో పాటు చదువుకునేందుకు అవకాశాలు కల్పించాలని, వారు ఎన్నికల్లో పోటీ చేసే విధంగా వెసులుబాటు కల్పించాలన్నారు. ప్రభుత్వం కొద్దిమందికి మాత్రమే పట్టాలిచ్చి చేతులు దులుపుకుందని, సాగుదారులకు పట్టాలు లేవనే సాకుతో ట్రాక్టర్లతో దున్ననివ్వడం లేదని, కరెంటు బోర్లు వాడరాదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ అధికారులు ములకలపల్లి మండలంలో జేసిబిలో తెచ్చి సాగుభూములను ధ్వంసం చేసి లాక్కున్నారని మండిపడ్డారు. అర్హులైన వారందరికీ పోడుపట్టాలు ఇవ్వాలని, రాజ్యాంగ పరంగా ఆదివాసీ గొత్తికోయల అభివృద్ధికి సహకరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు.

# వైద్యులు దేవుళ్లతో సమానం

**రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం**

**ప్రజాపక్షం/భద్రాచలం :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని స్థానిక రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా డా.తెల్లం వెంకట్రావుహాజరైన మాట్లాడారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు నిత్యం ముందుంటారని, రోగిని జబ్బు తగ్గితే ముందుగా సంతోషించేది వైద్యుడే అని అన్నారు. వైద్యులు మరింత నిబంధతతో పనిచేసి మంచిపేరు సంపాదించాలని కోరారు. అనంతరం డా.కాంతారావు, డా.సోమయ్య, డా. అజిత్ రెడ్డి, డా.రాజశేఖర్, డా. భార్గవి, డా.సంతోష్, డా.నారాయణ, డా.పవన్ రెడ్డి, డా. వెంకటేశ్వరరావులను సన్మానించారు.

**రోటరీక్లబ్ ఆధ్వర్యంలో...**

వైద్యులు దేవళ్లతో సమానమని రోటరీ ఇంటర్నేషనల్ 3150 గవర్నర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక అన్నపూర్ణ ఫంక్షన్ హాల్లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, వైద్యులు నిత్యం ప్రజల ప్రాణాలను కాపాడుతూ ముందుకు సాగుతుంటారని, మరింత అంకిత భావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన వైద్యులు డా.ప్రమీలారాణి, డా.సత్యం, డా.విజయరావు, డా.దేవరాజు, డా.విజయ్, డా.రాకేష్ తదితరులను సన్మానించారు.